


వివరాలు మెయిన్‌లో

**పెట్రోల్,డీజిల్ ధరల పెంపుతో ప్రజలపై మోయలేని భారం: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 21 మే , 2026 | పేజీలు : 06


# రైతన్న ‘వరి’గోస



### బస్తాకు 2 కిలోల అదనంగా తూకం
### తూకం వేసేముందు 60 కేజీల వరకు ధాన్యం పక్కకు...
### ధాన్యం తరలింపు పేరుతో బస్తాకు రూ.3 వసూళ్ళు
### మిల్లుల్లో తరుగు పేరుతో 3 కేజీల కోత





**ప్రజాపక్షం/సూర్యాపేట** : ఆరుగాలం శ్రమించి వరి పంటను పండించిన రైతులు గోసపడుతున్నారు. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకునే పాలకులు వారు పండించిన పంటను దళారుల దోపిడికి గురై నష్టపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా అక్కడ కూడా నిర్వాహకులు, ధాన్యం తరలింపు వారి చేతుల్లో, మిల్లర్ల చేతుల్లో దోపిడికి గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అధిక తూకం, పనివారు ధాన్యం పక్కకు తీసుకోవడం, ధాన్యం తరలింపుకు బస్తాకు రూ.3 వసూళ్ళు, మిల్లుకు తరలించిన తరువాత మిల్లర్ బస్తాకు 3 కేజీల వరకు కోత విధిస్తుండడంతో రైతులు నిలువునా మునుగుతున్నారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో మొత్తం 4లక్షల 82వేల ఎకరాలలో రైతులు వరిసాగు చేయగా 12లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేయగా ఇందులో 4.79లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించే లక్ష్యంగా సంబంధిత అధికారులు 554 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గత నెల 8వ తేదీ నుండి కొనుగోళ్ళు ప్రారంభించారు. ఈనెల 19వ తేదీ వరకు రైతుల నుండి 2,78,367.920 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేశారు. ఈ ధాన్యాన్ని ఆయా మిల్లులకు తరలించారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాల పరిధిలో కొనుగోలు ముగియడంతో 78 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగింది. సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గ ప్రాంతాల్లో కొనుగోళ్ళు మరో 10 రోజులు కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**బస్తాకు 2 కిలోల అదనంగా తూకం**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు బస్తాకు 2 కిలోలను అదనంగా తూకం వేస్తూ రైతులను దోచుకుంటున్నారు. బస్తా ధాన్యం తూకం 40 కేజీలు కాగా ఖాళీ బస్తా తూకం 60 గ్రాములు మొత్తం 40.60 గ్రాములు కాగా అదనంగా 2 కిలోలు తూకం వేస్తున్నారు. ఇదేమని రైతులు ప్రశ్నిస్తే తాళ్ళు, పెళ్ల, చెత్త పేరు చెప్పి నోర్లు మూయిస్తున్నారు.

**తూకం వేసేముందు 60 కేజీల వరకు ధాన్యం పక్కకు...**

రైతులు తెచ్చిన ధాన్యాన్ని తూకం వేసే ముందు బస్తాలకు ఎత్తేవారు, ఊడ్చేవారు, తూకం వేసే వారు రైతుల ధాన్యపు రాసుల నుండి సుమారు 30 బస్తాల ధాన్యం వేస్తే 3 డబ్బాల ధాన్యాన్ని తీసుకొని పక్కకు పెడుతున్న పరిస్థితి. ఈ మూడు డబ్బాల ధాన్యం దాదాపు 60 కిలోలు ఉంటుందని రైతులు వాపోతున్నారు. దీంతో దాదాపు రూ.1500లు నష్టపోతున్న పరిస్థితి నెలకొంది.

**ధాన్యం తరలింపు పేరుతో బస్తాకు రూ.3 వసూళ్ళు**

తూకాలు పూర్తయిన తరువాత ఆ ధాన్య బస్తాలను మిల్లులకు తరలించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. రైతుల చేతి నుండి ఒక్క పైసా కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. కానీ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని తరలించే ట్రాన్స్‌పోర్టు డ్రైవర్‌కు బత్తా పేరుతో బస్తాకు రూ.3 లు రైతుల ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇలా ప్రతి లారీకి 750 నుండి 800 బస్తాల వరకు ధాన్యం ఎత్తడంతో దాదాపు రూ.2,400 వరకు రైతులకు అదనపు భారం పడుతుంది.

**మిల్లుల్లో తరుగు పేరుతో 3 కేజీల కోత**

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మకం పూర్తి అయిన తరువాత కేంద్రాల నిర్వాహకులు మిల్లులకు ధాన్యాన్ని తరలించాల్సిన బాధ్యత ఉండగా రైతులను కూడా తోడుగా పంపుతున్నారు. దీనిని ఆసరగా చేసుకున్న మిల్లర్లు లారీలో వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా తేమ, పెల్ల, తాలు, చెత్తా చెదారం పేరుతో కొర్రీలు పెడుతూ తరుగు తీస్తున్నారు. బస్తాకు 3 కేజీలు కోత విధిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన రైతులను ధాన్యం దిగుమతి చేసుకోకుండా తమ మిల్లుల వద్దే రోజుల తరబడి పడిగాపులు కాయిస్తున్నారు. దీంతో చేసేది ఏమి లేని రైతన్నలు మిల్లర్లు చెప్పిన దానికి విని నష్టపోతున్నారు. ఈ విషయమై రైతులు కేంద్రాల నిర్వాహకులకు, సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో కన్నీరు పెడుతున్న పరిస్థితి. పత్రికల్లో వచ్చిన వార్త కథనాలకు అధికారులు స్పందించి హడావుడిగా కేంద్రాలను, మిల్లులను తనిఖీలు చేసినా వారి దోపిడిపై మాత్రం పెదవి విప్పకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు తమ తీరును మార్చుకొని రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## కేతేపల్లి పోలీస్ స్టేషన్ వద్ద భారీ అగ్ని ప్రమాదం

దగ్ధమైన సుమారు 30 సీజ్డ్ వాహనాలు..

కొయ్యకాళ్ల మంటలపై ఆరా..!

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి



వివరాలు మెయిన్‌లో

## ప్రజాసేవే లక్ష్యంగా.. ఇంటింటికీ ప్రభుత్వ పథకాల ప్రచారం



వివరాలు మెయిన్‌లో



## మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం/కోదాడ** :పట్టణ పరిధి హుజూర్‌నగర్ రోడ్డులోని శ్రీ అయ్యప్పస్వామి దేవాయలం సమీపం లోని కోదాడ, హుజూర్‌నగర్ ప్రదాన రహదారిపై అఖిల భారత అయ్యప్పదీక్షా సమితి వారి అధ్వర్యంలో బుధవారం పాదచారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అర్వపల్లి సత్యనారాయన మాట్లాడుతూ మజ్జిగ పంపిణీకి పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు కంచుగంటి వెంకటేశ్వర్లు, ధర్మపత్ని సైదమ్మలు ఆర్థిక సాయం అందించారని తెలిపారు. దీక్షా సమితి పట్టణ అధ్యక్షులు చిరుమామిల్ల చంద్రశేఖర్, కార్యదర్శి బెజవాడ శ్రీను,యశ్వంత్, ఉపాధ్యాక్షులు వెంకటేష్, జిల్లా అర్గనైజర్ డా॥ జగిని ప్రసాద్ పాల్గొన్నారు.

## ఉపాధి పనులు ముమ్మరం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని సిరిపురం గ్రామంలో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని పంచాయతీ కార్యదర్శి ఆర్. సతీష్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా కూలీలతో మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఉదయం ఆరు గంటల కల్లా పనికి చేరుకుని పది గంటలకు పనులు ముగించుకొని ఇంటికి వెళ్లాలని సూచించారు. కూలీలకు మంచినీటి సౌకర్యం, టెంట్ సౌకర్యాలను అడిగి తెలుసుక్నునారు. ఫీల్డ్ అసిస్టెంట్ జంపాల వెంకన్న, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

## వెంటనే తగ్గించాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** పెంచిన గ్యాస్, పెట్రోల్, డిజీల్ ధరలను వెంటనే కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని సిపిఎం సీనియర్ నాయకులు పారేపల్లి శేఖర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఎస్ భవన్‌లో జరిగిన సిపిఎం మండల కమిటి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను వెంటనే తగ్గించి సామాన్యులపై భారం తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు తుమ్మల సైదయ్య, షేక్ యాకుబ్, యానాల సోమయ్య, సుశీల, దోసపాటి బిక్షం, శ్రీనివాస్, మీసాల మట్టయ్య, సైదులు పాల్గొన్నారు.

## నేడు బొడ్రాయి ప్రతిష్ఠ

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని చిన్నసీతారాం తండలో బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం గ్రామంలో వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన యాగశాలలో స్థానిక సర్పంచ్ చందులాల్ దంపతులు ప్రత్యేకంగా హోమ గుండం వద్ద పూజలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము నుంచే బొడ్రాయి ప్రతిష్టాపనను వేదపండితులు నిర్వహించనున్నారు.

## లోడి స్వామి వర్ధంతి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** మండల కేంద్రానికి చెందిన బాలాజీ విజ్ఞాన మందిరం కరస్పాండెంట్, టిడిపి పార్టీ మండల నాయకుడి లోడి స్వామి 24వ వర్ధంతిని మండల కేంద్రంలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, ఎస్ఐ లక్ష్మీ నారాయణ, సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, అఖిలపక్ష నాయకులు బీసు చందర్ గౌడ్, జెన్నాయికోడె నగేష్, కోరె బిక్షపతి పాల్గొన్నారు.

## సాగర్ చారిత్రక వైభవాన్ని చాటిన హెరిటేజ్ వాక్



**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ టూరిజం వారోత్సవాలలో భాగంగా బుధవారం నాగార్జున సాగర్‌లో హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు జిల్లా పర్యాటక అధికారి మహమ్మద్ అక్బర్ అలీ ఆధ్వర్యంలో స్థానిక టూరిజం విజయ విహార్ అతిథి గృహం ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ పాల్గొన్న వారికి నాగార్జునసాగర్ ప్రాంత చారిత్రక, పర్యాటక విశిష్టతలను వివరించారు.కార్యక్రమంలో స్థానికులు నజీర్,అనిల్ కుమార్,రాజగోపాల్, అడ్వకేట్ వినోద్ కుమార్,మల్లికార్జున,అంజిబాబు,స్థానిక వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.హెరిటేజ్ వాక్ ద్వారా పర్యాటక ప్రదేశాల పరిరక్షణ,చారిత్రక వారసత్వంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** అన్ని వర్గాల అభ్యున్నతే తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వ ద్వేయమని హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరి రామస్వామి గుట్ట సమీపంలో ఏర్పాటు చేస్తున్న క్రిస్టియన్ శ్మశాన వాటిక పనులను మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్టయన్ సోదరులు చాల కాలంగా శ్మశాన వాటిక సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి గమనించిన రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఒక ఎకరం భూమిని కేటాయించడంతో పాటు ప్రహరిగొడ, ఇతర మౌళిక వసతుల అభివృద్ధికి రూ.70 లక్షలు మంజూరుచేయడం పట్ల స్థానిక క్రిస్టియన్ సంఘాలు హార్షం వ్యక్తం చేస్తున్నాయని అన్నారు. నియోజకవర్గ ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రజలందరిని తన సొంత కుటుంబ సభ్యుల్లా భావించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కొతి సంపత్‌రెడ్డి, ఎఈ వినోద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అశోక్, ఫాస్టర్లు, క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉచితంగా స్థలం కేటాయించడం అభినందనీయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పట్టణ ప్రజల సౌకర్యార్థం ట్యాంక్ బండ్ రోడ్డు విస్తరణ కోసం విలువైన స్థలాన్ని ఉచితంగా కేటాయించిన డాక్టర్ సల్వాది రమేష్ కుమార్ అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. సూర్యాపేట పట్టణంలోని సద్దుల చెరువు సమీపంలో జాతీయ రహదారి 65 సర్వీసు రోడ్డు పక్కన గల శ్రీసాయి సేవా సమితికి సంబంధించిన స్థలంలో సుమారు 131 గజాల స్థలాన్ని ట్యాంక్‌బండ్ రోడ్డు వెడల్పు కోసం మున్సిపాలిటికి బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ గతంలో ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన స్థలంలో విలువైన భాగాన్ని ప్రజల అవసరాల దృష్ట్యా రోడ్డు విస్తరణ కోసం ఉచితంగా ఇవ్వడం హర్షనీయమన్నారు. మున్సిపాలిటి ఆధ్వర్యంలో స్థలానికి హద్దులు నిర్ణయించి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ స్థలం కేటాయింపుతో చెరువు చివర రోడ్డు మరింత వెడల్పు కానుండగా, చెరువు ప్రవేశ ద్వారానికి నూతన హంగులతో ఆర్చి, గేట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. డాక్టర్ సల్వాది రమేష్ కుమార్ మాట్లాడుతూ తమ శ్రీసాయి సేవా సమితి ద్వారా వేలాది మందికి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించడంతోపాటు కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. ప్రజల సౌకర్యం కోసం మున్సిపల్ చైర్‌పర్సన్ కోరిన మేరకు ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన స్థలంలో గతంలో, ఇప్పుడు కొంత భాగాన్ని మొత్తం సుమారు 500 గజాలకు పైగా రోడ్డు విస్తరణ కోసం ఉచితంగా ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ హన్మంతరెడ్డి, వైస్ చైర్మన్ షఫీఉల్లా, కౌన్సిలర్లు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కొణతం రాజేష్, నాగుల వాసు, నామ అరుణ, అడ్వకేట్ నాతి సవీందర్, సముద్రాల మనోహర్ బాబు పాల్గొన్నారు.

## ఆన్ లైన్ డ్రగ్స్ అమ్మకాలు నిషేధించాలి

**ప్రజాపక్షం/రామన్నపేట :** మండలంలో ఆన్ లైన్ డ్రగ్ మందులను నిషేదించాలని మండల డ్రగిస్ట్ మండల కమిటీ ఆధ్వరంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా పలువురు మాట్లాడారు. ఆన్ లైన్ డ్రగ్స్ అమ్మకాలు నిషేధించాలని, ఆన్ లైన్‌లో నార్కోటిక్స్ డ్రగ్స్ సప్లైజరుగుతున్నాయన్నారు. వాటిని నిరోధించడానికి జాతీయస్థాయి బందు పిలుపులో భాగంగా మండలంలో ఉన్న మెడికల్ షాపులు అన్నీ బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు రాపోలు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి కె.నర్సింహ్మా, ఎంఎ మాలిక్, పున్న రామేశ్వరం, కరుణాకర్, రాపోలు రాజశేఖర్ పాల్గొన్నారు.




## బీక్యా నాయక్ మృతదేహానికి అయోధ్యరెడ్డి నివాళి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం కొత్తభావి తండాకు చెందిన ధరావత్ బిచ్చు నాయక్ తండ్రి, ధరావత్ భీక్య నాయక్ మరణించడంతో ఆయన పార్థీవ దేహానికి రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి పూలమాలర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయనతోపాటు మాజీ ఎంపీపీ బబ్బూరి రవీంద్రనాథ్ గౌడ్, మాజీ సర్పంచ్ బిచ్చు నాయక్, చొక్లాతండా మాజీ సర్పంచ్ రామోజీ నాయక్ ఉన్నారు.





## సమ్మర్ క్యాంపు సద్వినియోగం

**ప్రజాపక్షం/కోదాడ:** గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారుల నైపుణ్యలను మెరుగు పరిచి వారిని భవిష్యత్ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందకు జిల్లా యువజన క్రీడా సమైఖ్య వారి అధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రీడా క్యాంపులను యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిధి కాపుగలు సర్పంచ్, బిఆర్ఎస్ నాయకులు, మాజీ వాలీబాల్ క్రీడాకారులు దొంతగాని అప్పారావు అన్నారు. మంగళవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న ఉచిత వాలీబాల్ సమ్మర్ కోచింగ్ క్యాంపును ఆయన సందర్శించి వారికి బాల్స్‌ను బహుకరించి మాట్లాడారు. అనంతరం దాతల సహకారంతో అందిస్తున్న పౌష్టికాహార పంపిణీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు, సమ్మర్ క్యాంపు విద్యార్థులు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## క్షయరహిత సమాజమే లక్ష్యంగా కృషి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** క్షయవ్యాది రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ రాధ నాగరాజు అన్నారు. టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయంలో క్షయ నిర్ధారణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. 2030 నాటికి దేశం మొత్తాన్ని క్షయవ్యాది రహితంగా మార్చడం టిబి ముక్త్ భారత లక్ష్యమని తెలిపారు. రెండు వారాలకు మంచి దగ్గు, బరువు కోల్పోవడం, తేమడలో రక్తజీరలు, రాత్రి వేళ్లలో జ్వరం ఉన్నట్లయితే టిబిగా అనుమానించి వెంటనే తగిన పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం నాగయ్య, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పద్మ, ఆరోగ్య కార్యకర్తలు ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి, శ్రీనివాస్, ఝాన్సీ రాణి, కార్యదర్శి పద్మ, సూపర్‌వైజర్ మమత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ఉపాధి హామీ కూలీల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యమని వెలిదండ సర్పంచ్ చెనగాని సాంబయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు సర్పంచ్ చెనగాని సాంబయ్య ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేంద్రబాబు, స్థానిక వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు పాల్గొన్నారు.

## ఉపాధి కార్మికులకు మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని దయ్యం బండతండాలో ఉపాధిహామీ పనులు చేస్తున్న గ్రామ ప్రజలకు ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున వారి దాహార్తిని తీర్చడానికి మజ్జిక ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ సుధాకర్ నాయక్ తెలిపారు. ఆయన వెంట వార్డు సభ్యులు రాము నాయక్, మహేందర్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయలక్ష్మి ఉన్నారు.



# ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి

ప్రజాపక్షం/గరిదేపల్లి: అన్నిగిరిజన తండాలలో అర్హులైన పేద గిరిజనులను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని బిఆర్ఎస్ మండల ఎస్టీసెల్ అధ్యక్షులు గుగులోతు సందీప్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నర సంవత్సరాలు అయిందని ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానలను వెంటనే అమలు చేయాలని కోరారు. మండలంలో గిరిజనులను గుర్తించి తక్షణమే అన్ని తండాలలో ప్రతి తండాకు 300 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి న్యాయంచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# ఐకెపి వివోలు నిరసన



ప్రజాపక్షం/అడ్డగూడూరు : మండల కేంద్రంలో ఐకెపీ వివోల నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు గౌరవ వేతనం పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ వివోలు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వివోలు మాట్లాడుతూ తక్కువ వేతనాలతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని, సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవ వేతనం పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు.

# ఉచిత వైద్యశిబిరాలు

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : గ్రామీణ ప్రాంతాలలో కార్పోరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ ఇటికాల శ్రీను అన్నారు. బుధవారం మండలంలోని మాచారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో కామినేని హాస్పటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆర్థిక ఇబ్బందుల వల్ల పెద్ద ఆసుపత్రులకు వెళ్లలేక వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదనే శిభిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. శిభిరంలో 60 మంది పరీక్షలు నిర్వహించగా అవసరమైన 10 మందిని కామినేని హస్పటల్‌కు రిఫర్ చేసినట్లు హాస్పటల్ పిఆర్ఓ కళ్యాణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సాకేత్, అనూష, సుప్రజ, ఫణీంద్ర, గ్రామ పంచాయితీ కార్యదర్శి వెంకట్‌లక్ష్మి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గంగాపురం మల్లేష్

ప్రజాపక్షం/మోటకొండూర్ : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా రెండవసారి గంగాపురం మల్లేష్‌ను బుధవారం నియమించారు. యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డిలు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కోంతం మోహన్ రెడ్డి, మాజీ ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# స్వయం ఉపాధి ద్వారా ఎస్‌సి కుటుంబాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: స్వయం ఉపాధి పథకాల ద్వారా కుటుంబాల ఆర్థిక వృద్ధి సాధించాలని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర అన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపికకు బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో జాయింట్ ఐడెంటిఫికేషన్ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి పథకాల ప్రాముఖ్యతను వివరించారు. అర్హులైన అభ్యర్థులను పారదర్శకంగా ఎంపిక చేసి బ్యాంక్ రుణం,కార్పొరేషన్ సబ్సిడీతో జీవనోపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.2025/26 ఆర్థిక సంవత్సరానికి కార్పొరేషన్‌కు 45 యూనిట్లు మంజూరు కాగా 442 మంది అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.అభ్యర్థుల అర్హతలు, ఆర్థిక పరిస్థితులు అలాగే ఉపాధి అవకాశాలను పరిగణనలోకి తీసుకుని జాయింట్ ఐడెంటిఫికేషన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల అధికారులు, జిల్లా షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ అధికారులు, టి.ఎం.సి శ్రీనివాస్ కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో దళిత విద్యార్థులకు సీట్లు కేటాయించాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కీం క్రింద దళిత విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వమే పూర్తి వ్యయభారం భరించి నల్లగొండ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాబోధన నిర్వహిస్తున్నదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున పేర్కొన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ కు ఆసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ పథకం ద్వారా పేద,వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లభిస్తున్నప్పటికీ ప్రస్తుతం కొన్ని పరిమిత ప్రైవేట్ పాఠశాలలకే బిఎఎస్ స్కీం పరిమితం కావడం వల్ల అనేక మంది దళిత విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెమిడాల పరుష రాములు, జిల్లా సహాయ కార్యదర్శి గాదె నరసింహ,బొల్లు రవీందర్,జిల్లా నాయకులు మాతంగి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణనలో కుల గణన చేపట్టాలి



ప్రజాపక్షం/నకిరేకల్ : దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో కుల గణన చేపట్టి అన్ని వర్గాల జనాభా వివరాలను వెల్లడించాలని బీసీపీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు డిమాండ్ చేశారు.బుధవారం నకిరేకల్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో బహుజన మహాసభ (బీఎంఎస్)ఆధ్వర్యంలో అమరుడు మారోజు వీరన్న 28వ వర్ధంతి సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఆయన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల జనాభా దామాషా ప్రకారం బీసీలు, ఉపకులాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయ,విద్య, ఉద్యోగ,ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీఎంఎస్ నల్లగొండ జిల్లా కన్వీనర్ చెట్టుపల్లి కాశీరాం మాదిగ, బీసీపీజిల్లా నాయకుడు బొల్లికొండ లింగయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల శ్రీనివాస్,న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్,గజ్జి రవి,అక్కినపల్లి వీరస్వామి,గద్దం వెంకటరమణ,పోరెల్ల సైదులు,దుర్గం సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ మందుల విక్రయాలు నిలిపేయాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: కరోనా సమయంలో తీసుకొచ్చిన 871 జీవోను అడ్డుపెట్టుకొని కార్పొరేట్ కంపెనీలు ఆన్‌లైన్‌లో మందులు విక్రయిస్తూ మెడికల్ వ్యాపారుల పొట్టగొడుతున్నాయని జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పరమాత్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం నల్లగొండ పట్టణంలో మెడికల్ షాపుల యజమానులు షాపులను బంద్ చేసి భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పరమాత్మ మాట్లాడుతూచ కరోనా వేళ డోర్ డెలివరీ కోసం తెచ్చిన 871 జీవో ఇప్పుడు మెడికల్ షాపుల పాలిట శాపంగా మారిందన్నారు.ఆన్‌లైన్ వ్యాపారం వల్ల లక్షలాది మెడికల్ షాపుల యజమానులు నష్టపోతున్నారని,ఆన్‌లైన్‌లో నాసిరకం మందులు, యువతను మత్తెక్కించే మందులు సరఫరా కావడంతో యువత మానసికంగా, శారీరకంగా కృంగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పట్టణంలో రెండు ఎమర్జెన్సీ మెడికల్ షాపులను అందుబాటులో ఉంచామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోవర్ధన్,కోశాధికారి వెంకటేశ్వర్లు,పట్టణ అధ్యక్షుడు పి.రఘుపతి,కార్యదర్శి వి. శ్రీనివాసులు,కోశాధికారి జి.వెంకటేశ్వర్లు,సీహెచ్ పవన్ కుమార్,ఆర్.లక్ష్మీనారాయణ,జి.శ్రీనివాస్,ధనుంజయ్ పాల్గొన్నారు.






# నిరంతరాయంగా కేవీటి స్పోర్ట్స్ క్లబ్ క్రీడా సామాజిక సేవలు

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : గత 37 సంవత్సరాలుగా పోచంపల్లిలోని కేవీటి స్పోర్ట్స్ క్లబ్ పలు సేవ క్రీడా విద్యా వైద్య సంక్షేమ సామాజిక కార్యక్రమాలను నిరంతరాయంగా అందిస్తుందని ఆ క్లబ్ అధ్యక్షుడు కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం క్లబ్ 37వ వార్షికోత్సవం, కర్నాటి వెంకటేశం 59 జన్మదిన సందర్భంగా ఆయన కేవీటి కోవెలలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాటి భాస్కర్ స్మారకార్థం 50 మంది పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఉమాశంకర్ సీత శ్రీనివాస్, ప్రకాష్, తడక విష్ణు భాస్కర్, కర్నాటి ప్రభాకర్, గద్దం దేవికి నందన్, గంజి అంజి, కడవేరు రాజు, భోగ ధనుంజయ, బోడిగే శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 23 నుంచి 30 వరకు విత్తన వారోత్సవాలు

ప్రజాపక్షం/త్రిపురారం: మండలంలోని కంపసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానం,కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు విత్తన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ఎన్.లింగయ్య,కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు.వారోత్సవాల్లో రైతులకు నాణ్యమైన వరి విత్తనాలు అందుబాటులో ఉంచనున్నారు. సన్నగింజ రకాలైన జేజీఎల్27356,ఆర్ఎన్ఆర్15048,బీపీటీ 1504,కేఎన్ఎం1638, కేపీఎస్2874, కేపీఎస్6251 రకాలు, దొడ్డుగింజ రకాలైన కేఎన్ఎం118, జేజీఎల్24423 రకాల వరి విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని వారు పేర్కొన్నారు.10 కిలోల బస్తా విత్తనాల ధర సన్నగింజ రకాలకు రూ. 770, రూ.750 చొప్పున,దొడ్డుగింజ రకాలకు రూ.770 చొప్పున నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.విత్తనాలు కావాల్సిన రైతులు 9640370666ను సంప్రదించాలని సూచించారు.

# విద్యతోపాటు సాంస్కృతి కార్యక్రమాలు



ప్రజాపక్షం/నకిరేకల్ :విద్యార్థులకు విద్యతోపాటు సాంస్కృతి కార్యక్రమాలు,సృజనాత్మక అంశాలు ఎంతో అవసరమని మండల విద్యాధికారి అంబటి అంజయ్య అన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను ఆయన సందర్శించారు.ఆంగ్లం,తెలుగు దస్తూరి, చిత్రలేఖనం, క్రాఫ్ట్, క్రీడలు,కరాటే, యోగ, నృత్య శిక్షణ విభాగాల్లో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్ మైనం శివశంకర్,కరాటే మాస్టర్ శివరాం,డ్యాన్స్ మాస్టర్ తరుణ్,క్రాఫ్ట్ టీచర్ యాదమ్మ, ఉపాధ్యాయులు గఫూర్, సీఆర్పీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/నాంపల్లి :మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నిరుపేదలు అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందగా, వారికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య,జిల్లా నాయకులు ఏ.రఘుపతి రెడ్డి,పెద్దిరెడ్డి సంజీవరెడ్డి రాజు,టౌన్ ఉప సర్పంచ్ పానగంటి నిర్మల వెంకటయ్య గౌడ్,మార్కెట్ డైరెక్టర్ పూల యాదగిరి పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో సోమవారం రవ్వ శ్రవణ్ కుమార్ అనారోగ్యంతో చనిపోయారు. ఆర్థిక ఇబ్బందుల్లోఉన్న ఆ కుటుంబానికి మాజీసర్పంచ్ జిల్లా టిఆర్ఎస్ నాయకులు ఎడ్ల మహేందర్ రెడ్డి రూ.5000 ఆర్థిక సహాయం అందజేసి కుటుంబానికి భవిష్యత్తులో తనవంతు సహకారం అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు పున్న వెంకటేశం, పిట్ట మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## అంతరించిపోతున్న కళలను ఆదరించాలి



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** ఊరూరా తిరిగి తమ కళలతో ఉత్తేజితపరుస్తూ, జాంబవ పురాణం, ఎల్లమ్మ కథలు, జానపద పాటలు, ప్రదర్శనలతో జనాలను ఆలోచింపచేస్తు, తమ గ్రామనికి విచ్చేసిన మాదిగ ఆశ్రితకులం చిందు, యాక్షగాన కళాకారులకు దత్తాయపల్లి గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, వారి తండ్రి జేరిపోతుల రాజయ్య జ్ఞాపకార్థం 50 కిలోల బియ్యం వారి తల్లి జేరిపోతుల ఎల్లమ్మ ద్వారా అందచేసినట్లు తెలిపారు. చిందు యక్షగాణ కళాకారుల పాటలు, వారి ప్రదర్శనలు నేటి తరానికి చాలా అవసరమని, అంతరించిపోతున్న కళలను ఆదరించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు జేరిపోతుల లక్ష్మి , కవిత, రమేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం

**ప్రజాపక్షం/మునుగోడు:** మండల పరిధిలోని గుండ్లోరి గూడెం గ్రామానికి చెందిన జంగిలి విజయలక్ష్మికి మంగళవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేసి సమాచారం అందించారు.మునుగోడు 108 అంబులెన్స్ ఈఎంటీ గుంటి రమేష్,పైలట్ ఎస్‌కె మునీర్ వెంటనే అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స చేస్తూ నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు.మార్గమధ్యంలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్‌లోనే సిబ్బంది ప్రసవం చేయించారు.ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది.అనంతరం తల్లీబిడ్డను నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు.సకాలంలో స్పందించి అంబులెన్స్‌లోనే సురక్షితంగా ప్రసవం చేసిన108 సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# ధాన్యం సేకరణలో అక్రమాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని పలు ధాన్యం సేకరణ కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్‌ను కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు.కనగల్ మండలం జి.ఎడవెల్లి గ్రామ సేకరణ కేంద్రంలో రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు.రైతులకు ఇచ్చే ట్రక్ షీట్లో ఒక రకమైన తూకం,మిల్లర్లకు ఇచ్చే ట్రక్ షీట్లో మరో రకమైన తూకం చూపుతున్నారని, దీనికి సంబంధించిన ఆధారాలను కలెక్టర్‌కు అందజేశారు.తిప్పర్తి మండలంలోని మర్రిగూడెం,తిప్పర్తి,ఇండ్లూరు,మామిడాల తదితర కేంద్రాలకు బయటి రాష్ట్రాల నుంచి ధాన్యం వస్తోందని,స్థానిక నాయకులు,నిర్వాహకులు కుమ్మక్కై ఆ ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఆధారాలతో బయట పెట్టినా ఇప్పటివరకు చర్యలు లేవని పేర్కొన్నారు.నల్లగొండ మండలం అన్నెపర్తి కేంద్రంలో ఇప్పటివరకు 25



కొనుగోళ్లు కూడా జరగలేదని,వెంటనే స్పందించి సేకరణ వేగవంతం చేయాలని కోరారు.ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్,మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాసరెడ్డి, అన్నెపర్తి సర్పంచ్ మేక అరవింద్ రెడ్డి,మాజీ సర్పంచ్‌లు ఎలుక శ్రీనివాస్ రెడ్డి,కోట్ల జైపాల్ రెడ్డి,పెరిక కరుణ్ జయరాజ్,పలువురు రైతులు పాల్గొన్నారు.

# మందుల దుకాణాల బంద్ విజయవంతం

**ప్రజాపక్షం/చిట్యాలః** ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపివేయాలన్న డిమాండ్‌తో భారతదేశ వ్యాప్తంగా మందుల దుకాణాల బంద్ పిలుపును పురస్కరించుకుని నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో యజమానులు బుధవారం దుకాణాలను మూసివేశారు. పట్టణంలో వారు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపివేయాలని యజమానులు డిమాండ్ చేస్తూ, అధిక డిస్కౌంట్‌ల పేరుతో వినియోగదారులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. నకిలీ మందులను సరఫరా చేస్తున్న సంఘటనలు కూడా జరుగుతున్నాయని, వీటి వల్ల రోగులు మరింత అనారోగ్యం పాలౌతారన్నారు. మందుల ధరలపై ఇస్తున్న డిస్కౌంట్‌లను ప్రభుత్వం నియంత్రణలోకి తీసుకురావాలని వారు డిమాండ్




చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ దుకాణాల యూనియన్ మండల శాఖ అధ్యక్షులు వల్లపు నరేందర్, నాయకులు అంతటి అంజయ్యగౌడ్, ఏనుగు శేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, కైరంకొండ భాస్కర్, ఎస్ వెంకన్న, అంతటి స్వామి, నవీన్‌రెడ్డి, గంజి గోవర్ధన్, జి శ్రీనివాస్, శ్రీశైలం, లింగస్వామి, నగేష్, భరత్, అరుణ్ కుమార్, రాజశేఖర్, వెంకటేశం, విక్రమ్, భాష, రాకేష్ గౌడ్, మధు, దుర్గయ్య, మెహర్‌బాబు పాల్గొన్నారు.

# తవ్వి వదిలేశారు

**ప్రమాదకరంగా గుంతలు**
**మెగా గ్యాస్ కంపెనీ నిర్వాకం**

**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలోని 6వ వార్డులోని ప్రధాన వీధిలో మెగా గ్యాస్ కంపెనీ వారు ఇంటింటికి గ్యాస్ కనెక్షన్ పైప్ లైన్ కోసం గాతులను తవ్వి వదిలివేశారు. ఈ గుంతలు ప్రమాదకరంగా మారాయి. మెగా గ్యాస్ వారు ఇంటింటికి పైప్ లైన్ ద్వారా కనెక్షన్ ఇచ్చేదానిలో భాగంగా పట్టణాన్ని మోడల్ సిటిగా తీసుకుని గత నెల రోజుల క్రితం పనులు ప్రారంభించింది. అందులో భాగంగా 6వ వార్డులోని విద్యానగర్‌లో సుమారు అరకిలోమీటర్ మేరకు పైప్ లైన్ కోసం గాతులు తవ్వి పైపులు వేశారు. కాని అక్కడక్కడా పైపులు జాయింట్ చేయడం కోసం గుంతలను వదిలేశారు. సాయి బృందావనం కాలనీలో సిసి రోడ్డును కూడా తవ్వి నిర్లక్ష్యంగా వదిలేశారు. సిసి రోడ్డు పగులగొట్టిన క్రమంలో వాటర్ పైపులు పగిలిపోయి



నీరు వృధాగా పోతుంది. గుంతలు ఉన్న ప్రదేశంలోనే మన గ్రోమోర్ ఎరువుల దుకాణం ఉండటంతో ఇక్కడకు వచ్చే రైతులు అసౌకర్యానికి, ఇబ్బందులకు గురౌతున్నారు. ఈ దారి వెంట వెళ్ళే వాహనదారులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. వేసవి సెలవులు కావడంతో ఈ వీధిలోని చిన్నారులు సైకిళ్ళపై తిరుగాడుతుంటారు. గుంతలు ఉన్న దగ్గర కనీస బాధ్యతగా హెచ్చరిక బోర్డులు కూడా పెట్టలేదు. వెంటనే గ్యాస్ కంపెనీ వారు కాని, మున్సిపాలిటి పాలక వర్గం కాని చొరవ తీసుకుని గుంతలను మూసి వేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే అప్రమత్తమైతే మంచిది కదా.

# విబిజి రాంజీ రద్దు చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, వీబీజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య డిమాండ్ చేశారు.బుధవారం కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఉపాధి కూలీలు గ్రామీణ సంపద సృష్టిలో కీలకంగా ఉన్నారని, చెరువుల పూడిక తీత, రహదారులు, కాలువల నిర్మాణం ద్వారా బీడు భూములను సాగులోకి తెస్తున్నారని తెలిపారు. కొత్త జీవోలతో ఉపాధిని దూరం చేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు.పనిచోట కనీస సౌకర్యాలు లేవని, పే స్లిప్పులు ఇవ్వడం లేదని, కూలీని ఏడాదికి 200 రోజులకు పెంచి రోజుకు రూ.800 ఇవ్వాలని కోరారు.ఈకేవైసీ,ఫోటో క్యాప్చర్ విధానం రద్దు చేయాలని, ప్రమాద



బాధితులకు ఉచిత వైద్యం,రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన వెంకులు,మహిళా కూలీల కన్వీనర్ దండంపల్లి సరోజ, నాయకులు చెరుకు పెద్దలు,మన్నెం బిక్షం, గుండ్ల రాములు,పెంటమల్ల సుకన్య,మర్రి వెంకటయ్య,రెమిడీల బిక్షం,కర్నాటి సుధాకర్,కట్ట అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## క్రీడాకారులకు పండ్ల పంపిణీ

**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో నిర్వహించబడుతున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు ఎన్‌టిఆర్ అభిమాన సంఘం నాయకులు బుధవారం పండ్లు, బిస్కెట్లు, చాక్లెట్లను పంపిణీ చేశారు. సినీ నటులు జూనియర్ ఎన్టీరామారావు జన్మదినం సందర్భంగా అభిమానులు కేక్‌ను కట్ చేశారు. వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులను సంఘ నాయకులు ఈ సందర్భంగా అభినందించి, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అభిమాన సంఘ నాయకులు ఉయ్యాల నాగరాజుగౌడ్, పాల బాలకృష్ణ, మాదగోని వెంకటేశం, మట్టిపల్లి నాగరాజు, సాగర్ల వెంకన్న, దండంపెల్లి భరత్ పాల్గొన్నారు.

## జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో జూనియర్ ఎన్‌టీఆర్ 43వ జన్మదినాన్ని పురస్కరించుకోని బుధవారం పట్టణ అధ్యక్షుడు ఇండ్ల గణేష్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు అల్పాహారం, అరటిపండ్లు పంపిణి చేసి మాట్లాడారు. సమాజం పట్ల వారికి ఉన్న బాధ్యత పేద వారి ఆకలి తీర్చడంలో ఉండే సంతోషం అమూల్యమైందన్నారు. కార్యక్రమంలో బిఎం. నాయుడు, యనగండ్ల లింగయ్య, ఏచూరి మురహరి భాగ్యలక్ష్మి , కర్ర రాంరెడ్డి, బంటు రాజు, ఉపేందర్, ధర్మతేజ, శివశంకర్, మహేందర్, రాము, శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఏఐ ఆధారిత నకిలీ ప్రిస్క్రిప్షన్‌తో ప్రజల ప్రాణాలకు ముప్పు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సాంకేతికతను ఆసరాగా చేసుకోని ఏఐ సాయంతో పుట్టుకొస్తున్న నకిలీ ప్రిస్క్రిప్షన్లు, నియంత్రణ లేని ఈఫార్మసిల వల్ల ప్రజా రోగ్యం తీవ్ర ముప్పులో పడిందని ఔషద వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ సంస్థ ఏఐవోసీడీ పిలుపునందుకోని ది తెలంగాణ కెమిస్ట్, డ్రగ్గిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో మెడికల్ షాపులను పూర్తిగా బంద్ చేశారు. ఈ పోరాటం తమ సొంత వ్యాపార లాభాల కోసం కాదని, నకిలీ మందుల బారిన పడుతున్న అమాయక రోగుల ప్రాణాలను కాపాడేందుకేనని అన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఎలాంటి ప్రిస్క్రిప్షన్ రూల్స్ పాటించకుండా జరుగుతున్న విక్రయాలను తక్షణమే నిషేదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెమిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.గోవర్ధన్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, కె.శ్రీధర్, నరేష్, రషీద్, కరుణాకర్, శ్యామ్, రాంబాబు, వెంకటేశ్వర్లు, లింగయ్య, భాస్కర్, మునీర్, లక్ష్మణ్, సారధి, ప్రవీణ్, అశోక్, సత్యం, రవి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల వ్యాపంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్లను పూర్తి చేసుకోవాలని ఎంపిడివో ఛండీరాణి సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పంపిణి రెండవ విడత ప్రారంభమవుతున్న నేపథ్యంలో మొదటి విడతలో ఇండ్ల వచ్చి ఇంకా ఇండ్ల నిర్మాణం పూర్తికాని లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసుకొని గృహప్రవేశాలను చేసుకోవాలని అన్నారు.



## ‘సర్’ మ్యాపింగ్‌పై ఆర్‌డిఒ సమీక్ష

**ప్రజాపక్షం/దేవరకొండ;** రాజస్వ మండలాధికారి కార్యాలయంలో దేవరకొండలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం ఆర్డీవో పద్మప్రియ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ మ్యాపింగ్, వాటి నియమ నిబంధనలు, 18 సంవత్సరములు నిండిన వారు కొత్తగా ఓటు నమోదు చేసుకొనుట, ఓటర్ల సవరణ చేసుకోనుట, రాజకీయ పార్టీల వారు వారి పార్టీల యొక్క బిఎల్ఏలను నియమించాలని ఆర్డీవో సూచించారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తాత్కాలిక కమిషనర్‌గా రవీందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నందికొండ:** నందికొండ మున్సిపాలిటీ మున్సిపల్ కమిషనర్‌గా (ఎఫ్ఏసీ) హాలియా మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం నందికొండ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్ రెడ్డి ఒక నెల రోజులు సెలవులోకి వెళ్లిన నేపథ్యంలో, ఆ వ్యవధిలో పరిపాలనా బాధ్యతలను నిర్వహించేందుకు కె. రవీందర్ రెడ్డిని తాత్కాలికంగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్యం, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు.

## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దేశ వ్యాప్తంగా బీసీ కులగణన చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని పీపీసీ డెలిగేట్ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య అన్నారు. బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, ముఖ్యంగా బీసీలకు ఎప్పటి నుంచి ఉన్న డిమాండ్‌ను సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం దీనికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే నామినేటెడ్ పదువులు కూడా కులగణన ఆధారంగా ఇవ్వాలని కోరారు. బీసీల ఐక్యతకు తీర్పు నిదర్శనమని, రాబోయే రోజుల్లో కూడా బీసీలందరు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని తెలిపారు.

## మంజుల కుటుంబాన్ని పరామర్శ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం రామారం గ్రామానికి చెందిన 5వ వార్డు సభ్యురాలు కనగంటి మంజుల ఇటీవల మరణించడంతో విషయం తెలుసుకున్న ఆలేరు మాజీ ఎంఎల్‌ఏ గొంగిడి సునిత మహేందర్‌రెడ్డి బుధవారం మంజుల కుటుంబాన్ని పరామర్శించి ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మంజుల కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని అన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



# భూకంపాలు,వడగాల్పుల నిర్వహణపై శిక్షణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం వేదికగా యువ ఆపదమిత్ర క్యాడెట్లకు భూకంపాలు,వడగాల్పుల నిర్వహణపై మంగళ వారం శిక్షణ నిర్వహించారు. ఎన్‌డిఆర్ఎఫ్,ఎస్‌డిఆర్ఎఫ్,జిల్లా విపత్తుల నిర్వహణ అధికారులు,31వ బెటాలియన్ అధికారులు క్యాడెట్లకు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు,అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు.అనంతరం మాక్ డ్రిల్ నిర్వహించారు.ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ దక్కన్ పీఠభూమిలో భూకంపాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని, ఆకస్మిక వరదలు, వడగాల్పులు ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని తెలిపారు.అలాంటి విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ, ప్రాణాలను కాపాడే కార్యక్రమాల్లో ఎన్‌సిసి క్యాడెట్లు ముందుండాలని సూచించారు.కార్యక్రమంలో 31 బెటాలియన్ అధికారులు శశిధర్ రావు, మాధవరావు,కొమ్ము మల్లయ్య, డాక్టర్ మచ్చేందర్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల వద్ద బిఆర్ఎస్ నాయకులు ఆందోళనలు

**ప్రజాపక్షం/దేవరకొండ;** శుక్రవారం దేవరకొండ నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద బిఆర్ఎస్ పార్టీ నేతలు ఆందోళనలు నిర్వహించాలని దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా కొనుగోలు కేంద్రాల వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేయాలని ఆయన కోరారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనే దిక్కులేక రైతులు ఆవేదన పడుతున్నారని ఆయన అన్నారు. అప్పులు తెచ్చి పంట పండిస్తే కొనే దిక్కులేక పోయారని అన్నారు. గన్ని బ్యాగులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదు అని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎప్పుడూ వడ్ల కొనుగోలులో ఇంత ఆలస్యం జరగలేదని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం రైతుల నుండి తరుగుపేరిట 2 కేజీల వడ్లు కట్ చేస్తున్నారు అని వెంటనే ఆపాలని కోరారు. మిల్లర్లు 3 కేజీలు కట్ చేస్తున్నారు అని ఆయన అన్నారు. అధికారులు ఏం చేస్తున్నారు కొనుగోలు కేంద్రాల్లో తిరగాలి అని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందని , పాలన చేతకాకుంటే రేవంత్‌రెడ్డి దిగిపోవాలని ఆయన అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 7 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# సిఆర్‌పి స్ట్రాటజీ ట్రైనింగ్‌లో పాల్గొన్న సెర్ప్ డైరెక్టర్ నవీన్



**ప్రజాపక్షం/తిప్పర్తి:** మండలంలోని 33 గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లకు నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో సెర్ప్ డైరెక్టర్ నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త సంఘాల ఏర్పాటు,స్నేహ సంఘాలు, వికలాంగుల సంఘాల ఏర్పాటు,బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల వినియోగం, జీవనోపాధుల కల్పనపై పలు సూచనలు చేశారు.జిల్లాలో అత్యధికంగా కొత్త సంఘాలు ఏర్పాటు చేసినందుకు, ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ వివరాలను 100 ఆన్‌లైన్ చేసినందుకు సిబ్బందిని ఆయన అభినందించారు.బ్యాంక్ రుణాలు,స్త్రీనిధి రుణాలు విస్తృతంగా ఇవ్వాలని, మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్దకు వెళ్లి ఇబ్బంది పడొద్దని సూచించారు.కొన్ని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి రుణాల బకాయిలను రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.కార్యక్రమంలో సెర్ప్ డీపీఎం కరుణాకర్,డీఆర్డీఏ డీపీఎం రామలింగయ్య, మండల సమాఖ్య ప్రతినిధులు సునీత, అజీమా, రాణి,ఏపీఎం సంకు హరి,అకౌంటెంట్ రేణుక, ఆపరేటర్ సందీప్ పాల్గొన్నారు.

# ఉద్యమ తీరుపై చాయ్‌పే చర్చ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ తీరు, మలి దశ ఉద్యమంలో జరిగిన కార్యక్రమాలపై బుధవారం పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ ఇందిరా క్యాంటీన్ వద్ద జరిగింది. ఉద్యమకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందని సీనియర్ జర్నలిస్టు ఖాజా హమీదొద్దీన్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరధనాయక్, బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు, తొలి దశ తెలంగాణ ఉద్యమ సంఘం అధ్యక్షుడు లింగయ్యలు అన్నారు. ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం చ్యలు తీసుకుంటుందని అందులో భాగంగానే తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన వారికి మొదటి ప్రాధాన్యత, జైలు పాలైన వారికి రెండో ప్రాధాన్యత ఇచ్చి ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ఇక్బాల్, కిశోర్, విజయకుమార్, లక్ష్మయ్య, మల్లయ్య, లింగయ్య, జయరాజు, రమేష్, ఈశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ ఔషధాల విక్రయాలు, భారీ డిస్కౌంట్లు రద్దు చేయాలని డిమాండ్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఆన్‌లైన్ ఔషధాల విక్రయాలు, భారీ డిస్కౌంట్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా డ్రగ్గిస్ట్స్ అండ్ కెమిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోచంపల్లి మండల వ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్ చేశారు. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్రీ, డ్రగ్గిస్ట్స్ పిలుపుమేరకు బుధవారం అసోసియేషన్ మండల అధ్యక్షులు అమృతం అశోక్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని మెడికల్ దుకాణాలను మూసివేసి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు గడ్డం వెంకటేశం హాజరయ్యి మాట్లాడుతూ ఆన్లైన్ ఫార్మసీ విధానం విక్రయాలు బహుళ జాతి కంపెనీ మెడిసిన్స్ పై భారీ డిస్కౌంట్లను వెంటనే రద్దు చేయాలనీ నకిలీ మందులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వారాల యాదిరెడ్డి మండల నాయకులు చిలువేరు ఆంజనేయులు, ఎర్రవాడా శంకర్, సోమవరపు లక్ష్మీనారాయణ, బండి రవి, బైరు వీర చక్ర సామ్రాట్, రుద్ర ప్రభాకర్ పాల్గొన్నారు.



## రోడ్డుపక్కనే బండరాళ్లు...

### ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు...

**ప్రజాపక్షం/చింతలపాలెం :** చింతలపాలెం నుండి యర్రకుంట తండాకు వెళ్లే ప్రధాన రహదారి రైస్ మిల్లు సమీపంలో రోడ్డు పక్కనే భారీ బండరాళ్ల కుప్పలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఈ రాళ్లు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో శుక్రవారం ఊరి పండుగ జరుగుతున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుండి బంధువులు, ప్రజలు అధిక సంఖ్యలో గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో రహదారిపై వాహనాల రాకపోకలు పెరిగాయి అయితే రోడ్డుపక్కనే నిర్లక్ష్యంగా వేసిన పెద్ద రాళ్లు ప్రమాదాలకు కారణమయ్యే పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు ముందే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని మండిపడ్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అదికారులు, గ్రామ పంచాయితీ సిబ్బంది వెంటనే స్పందించి రోడ్డు పక్కన ఉన్న బండరాళ్లను తొలగించి వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులుగా ఇమ్మడి దశరథగుప్త



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఇమ్మడి దశరథగుప్త నియమితులయ్యారు. బుధవారం ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్త మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి ఒక్క పేదకు అందేవిధంగా చర్యలు తీసుకుంటానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంఎల్‌ఏ, బీర్ల అయిలయ్య, రాష్ట్ర, జిల్లా అధ్యక్షులుకు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్‌లోకి చేరికలు

**ప్రజాపక్షం/నూతనకల్ :** మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డు సైదులు, దిండుగల బిక్షంలతోపాటు పలువురు నాయకులు తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ సమక్షంలో బుధవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. నూతనంగా పార్టీలోకి చేరిన వారిని గాదరి కిషోర్ కుమార్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెసిఆర్ పాలనలోనే రాష్ట్ర ప్రజలందరికి మేలు జరిగిందని, అందరికి అన్ని రకాల సంక్షేమ పథకాలు అందాయని, అతి కొద్ది రోజులలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. రానున్న రోజుల్లో మళ్ళీ బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మున్న మల్లయ్య యాదవ్, నాయకులు బత్తుల సాయిలు గౌడ్, కనకటి వెంకన్న, గాజుల తిరుమలరావు, జటంగి సరిత కృష్ణ యాదవ్, చూడి లింగారెడ్డి, కొచ్చర్ల బాబు, ఏర్పుల నరేష్ పాల్గొన్నారు.



# వరి కొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** రైతన్నలు వరి కోతల అనంతరం పొలాల్లో మిగిలిన వరికొయ్యలను తగలబెట్టడం భూసారానికి, పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని నకిరేకల్ సహాయ వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ జానిమియా తెలిపారు.వరి కొయ్యలను కాల్చడం వల్ల నేలలో ఉండే సేంద్రియ పదార్థాలతో పాటు నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి పోషకాలు నశిస్తాయని, జింక్, సల్ఫర్, ఐరన్ వంటి సూక్ష్మపోషకాల స్థాయిలు కూడా తగ్గిపోతాయని పేర్కొన్నారు. వానపాములు, సూక్ష్మజీవులు, ప్రయోజనకర జీవులు నశించి భూమి సారవంతత దెబ్బతింటుందన్నారు.వరికొయ్యలను కాల్చడం వల్ల కార్బన్ డయాక్సైడ్,నైట్రస్ ఆక్సైడ్ వంటి వాయువులు విడుదలై వాతావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. పొగ ప్రభావంతో దగ్గు, కళ్ల మంట,శ్వాస సంబంధ సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పొగమంచు పెరగడం వల్ల రహదారులపై దృశ్యమానత తగ్గి వాహన ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంటుందని తెలిపారు.వరికొయ్యలను కాల్చడం వల్ల నేల గట్టిపడి నీటి నిల్వ సామర్థం తగ్గి పంట దిగుబడిపై ప్రభావం పడుతుందని, క్రమంగా భూమి బీడు భూమిగా మారే ప్రమాదం ఉందన్నారు. కోతల అనంతరం వరికొయ్యలను యంత్రాల సాయంతో చిన్న అవశేషాలుగా మార్చి, ట్రాక్టర్ రోటవేటర్‌తో 20 నుంచి 25 రోజుల వ్యవధిలో రెండు సార్లు దమ్ము చేస్తే గడ్డి కుళ్లి సేంద్రియ కర్బనంగా మారి భూసారం పెరుగుతుందని తెలిపారు. రైతులు వరికొయ్యలను తగలబెట్టకుండా శా)య పద్ధతులు పాటించి భూమిని పరిరక్షించాలని ఆయన సూచించారు.



# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం బిల్డింగ్ తండాకు చెందిన రమావత్ నరసింహా (51) మంగళవారం సాయంత్రం ఇంటి నుండి బయటకు వెళ్ళి రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో బుధవారం తెల్లవారుజామున చందంపేట నుండి తేల్దేవరపల్లి వెళ్ళే రహదారి కోరుట్ల శివారులో కల్వర్ట్ పక్కన బైక్ అదుపుతప్పి పడి ఉండడంతో స్థానికులు వెళ్లి పరిశీలించడగా వ్యక్తి మరణించి ఉండడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతదేహం వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు హత్య జరిగిందని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ లోకేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సుప్రీంకోర్టు ఓకే చెప్పడం బిసిల విజయం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జనగణనలో కులాల లెక్కింపులో సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. కొంత మంది కులగణన వ్యతిరేకులు జనగణనలో కులాల లెక్కింపు అవసరం వద్దని సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేశారని, కాని సుప్రీంకోర్టు న్యాయమైన తీర్పు ఇచ్చిందని సంక్షేమ పథకాల అమలుతోపాటు ఎవరి జనాభా ఎంతో ఉందో తెలిస్తేనే జనాభా దామాషా ప్రకారం వారికి నిధులు కేటాయించబడుతాయని దీంతో బీసీ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు.



# మండల పార్టీ అధ్యక్షుడిగా చీర సత్యనారాయణ

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా మర్యాల గ్రామానికి చెందిన చీర సత్యనారాయణను మండల పార్టీ అధ్యక్షుడీగా బుధవారం భువనగిరి వివేరా హోటల్లో జరిగిన సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ ఆదేశాల మేరకు ప్రభుత్వ వైప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మండల పార్టీ నియామక పత్రంని అందజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు చీర సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని నాపై నమ్మకంతో బాధ్యతలు చెప్పినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎల్ఈడీ లైట్లు.. ప్రమాదాలకు దారి

అదనపు ఫిట్టింగులు...నిబంధనలకు విరుద్ధంగా లైట్లు..ఇష్టానుసార వినియోగం

పట్టించుకోని ఆర్‌టిఏ

నిబంధనలు అమలు ఎక్కడ..?



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో ఎల్ఈడీ లైట్ల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. ద్విచక్ర వాహనాలు మొదలుకుని ఆటోలు, కార్లు, లారీలు,ప్రైవేట్ బస్సుల వరకు అధిక వెలుతురు ఇచ్చే లైట్లు అమర్చడం సాధారణంగా మారింది. ఇతరుల ప్రాణాలకు ముప్పు అని తెలిసినా కొందరు వాహనదారులు అదనపు ఫిట్టింగులు ఏర్పాటు చేస్తుండగా, పర్యవేక్షించాల్సిన ఆర్టీఏ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాల ఎల్ఈడీ లైట్లతో కళ్లుచెదిరి రోడ్లు సరిగా కనిపించని పరిస్థితి నెలకొంటోంది. హైవేల వెంట గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో గుంతలు, రోడ్డు అంచులు గుర్తించలేక ప్రమాదాల ముప్పు పెరుగుతోందని వాహనదారులు చెబుతున్నారు. భారీ వాహనాలు ఎదురుగా చిన్న వాహనాలు వచ్చినా హైబీమ్ లైట్లు తగ్గించకపోవడంతో ఇబ్బందులు అధికమవుతున్నాయని వాపోతున్నారు.కొన్ని బైక్‌లు,ఆటోలు,ఇతర వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా అధిక వెలుతురు లైట్లు అమర్చడంతో ఎదురుగా వచ్చే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు రోడ్డు కనిపించక వాహనాలు పక్కకు తప్పుకుంటు ప్రమాదాల బారిన పడుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి.మోటార్ వెహికల్ చట్టం ప్రకారం కంపెనీ అమర్చిన ప్రమాణాలకు అనుగుణమైన లైట్లు మాత్రమే వినియోగించాలి. అదనపు ఫిట్టింగులు, నిబంధనలకు విరుద్ధంగా లైట్లు అమర్చడం చట్టవిరుద్ధం. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు హైబీమ్‌కు బదులుగా లోబీమ్ వినియోగించాలి. నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన ఎల్ఈడీ లైట్లపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రమాదాలు నివారించి ప్రజల ప్రాణాలు కాపాడాలని వాహనదారులు కోరుతున్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని వీటీ కాలనీ వద్ద మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 48 ఏళ్ల వయసున్న మగ వ్యక్తి బ్లూ గీతల షర్ట్, బ్లూ పాయింట్ ధరించి ఉన్నాడు.బుధవారం మధ్యాహ్నం 4:38 గంటల సమయంలో వీటీ కాలనీ వద్ద చనిపోయి ఉండగా స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నల్లగొండ 2టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సైదులును సంప్రదించాలని కోరారు.

# మైలారం రవికి డాక్టరేట్ ప్రదానం

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండలంలోని మటూర్‌కు చెందిన మైలారం ఇస్తారి సతమ్మల కుమారుడు మైలారం రవి వంద ఏళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టర్ పట్టా (పిహెచ్‌డి) పొందారు. ఆయన ప్రాథమిక విద్యను మటూర్ ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి చేశారు. పేద కుటుంబంలో జన్మించిన రవి చదువుకు పేదరికం అడ్డు కాదు అని నిరూపిస్తూ కష్టపడి చదివి డాక్టరేట్ సాధించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి మాజీ వైస్ చైర్మన్ , శాతవాహన విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ అయిన ప్రొఫెసర్ ఎస్.మల్లేష్ పర్యవేక్షణలో రేషనలిజం ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ కాంటెంపరరీ ఫిలసాఫికల్ స్కూల్స్ అనే అంశంపై పరిశోధన నిర్వ హించారు. సమాజంపై హేతువాద ప్రభావం ఎలా ఉందనే అంశమే ఈ పరిశోధన ప్రధాన సారాంశమని తెలిపారు. తన డాక్టరేట్‌ను తన తండ్రికి అంకితం చేస్తున్నట్లు రవి భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా రవికి కుటుంబ సభ్యులు, మిత్రులు, గ్రామస్థులు మరియు అధ్యాపకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండల వ్యాప్తంగా కుప్పలుకుప్పలులుగా పేరుకపోయిన ధాన్యం కొనుగోలును వేవవంతం చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని బిజెవైఎం రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యంతో పడిగాపులు కాస్తున్నా కొనుగోలు సాగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తీవ్రమైన ఎండలు ఉండడంతో ధాన్యం రాశులు వద్ద రైతులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. ధాన్యం కుప్పల మీదనే రైతన్న ప్రాణాలు విడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి అధికారులు నిద్రమత్తు వీడి కొనుగోలు కేంద్రాల్లో సరిపడ లారీలను ఏర్పాటు చేసి కొనుగోలును వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా తుల్జాభవాని పండుగ

**ప్రజాపక్షం/చివ్వెంల :** మండలంలోని పశ్చ్యానాయక్ తండలో బుధవారం తండావాసులు తుల్జాభవాని పండుగను ఘనంగా నిర్వహించారు. భవాని అమ్మవారికి మొక్కులు చెల్లించి తమని చల్లగా చూడాలని వేడుకున్నారు. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాదిలు హాజరయ్యారు. భవాని మాతకు ప్రత్యేక పూజలు చేసిన వారు తండావాసులకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధరావత్ కనకమ్మ సోమాని, మాజీ సర్పంచ్ పద్మ మంగ్తానాయక్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు పాపా నాయక్, మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్ పాల్గొన్నారు.



# హన్యానాయక్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకులు, సామాజిక వేత్త, పాస్టర్ ధీరావత్ హన్యానాయక్ జన్మదిన వేడుకలను బుధవారం చిన్నారులు మధ్య చిన్నారుల మధ్య ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసి వృద్ధులకు, యాచకులకు, పండ్లు, మిఠాయిలు పంపిణి చేసి అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనార్ధన్, రమాబాయి, సుధారాణి, సామ్యేల్, కోటేశ్వర్ రెడ్డి, మంగమ్మ, లక్ష్మ మ్మ, రేకమ్మ, హనుమ, ద్వాలి, సుచరిత, సుధాకర్‌రాజు పాల్గొన్నారు.

